రవి బిష్ణోయ్ @ 1

దుబాయ్: టీమ్ఇండియా యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) బుధవారం ప్రకటించిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో బిష్ణోయ్ 699 పాయింట్లతో ఐదు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ క్రమంలో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్‌ఖాన్(692)ను రెండో ర్యాంక్‌కు పరిమితం చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టీ20 సిరీస్‌లో రవి బిష్ణోయ్ తొమ్మిది వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. మరోవైపు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (855) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ (688) ఏడో ర్యాంక్‌లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా (204) మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

భారత్ X అఫ్గాన్

దుబాయ్ : శుక్రవారం ఆరంభం కానున్న ఏసీసీ పురుషుల అండర్-10 ఆసియాకప్ క్రికెట్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత యువ జట్టు శుక్రవారం అఫ్గానిస్థాన్‌తో తలపడుతుంది. అదేరోజు పాకిస్థాన్ నేపాల్‌ను ఢీకొంటుంది. ఎమిరేట్స్ క్రికట్ బోర్డు నిర్వహిస్తున్న ఈ 50 ఓవర్ల టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఇండియా, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, నేపాల్ గ్రూప్-ఎలో, బంగ్లాదేశ్, శ్రీలంక, జపాన్, ఆతిథ్య యూఏఈ గ్రూప్-బిలో తలపడతాయి. రెండు గ్రూపులలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 15వ తేదీన సెమీఫైనల్స్‌లో పోరాడతాయి. 17వ తేదీన దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో ఫైనల్ జరుగుతుంది. కాగా గ్రూపు మ్యాచ్‌లు ఐసీసీ అకాడమీ ఓవల్స్‌లో జరుగనున్నాయి. మ్యాచ్‌లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.30గం.(భారత కాలమానం ఉదయం 11గం.)లకు ప్రారంభమౌతాయి.

షెఫాలీ ఒంటరి పోరాటం వృథా

ఇంగ్లండ్ బోణీ

స్కీవర్, వ్యాట్ విజృంభణ • భారత్‌పై ఘన విజయం

ఆసియా చాంపియన్స్ భారత్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. సొంతగడ్డపై తమకు తిరుగు లేదనుకున్న టీమ్ఇండియాకు ఇంగ్లండ్ దిమ్మతిరిగే ఝలక్ ఇచ్చింది. వాంఖడేలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. భారత బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ స్కీవర్, వ్యాట్ అర్ధసెంచరీలతో ధనాధన్ ఇన్నింగ్స్‌తో దుమ్మురేపారు. ఫలితంగా భారీ స్కోరు అందుకున్న ఇంగ్లండ్.. బౌలింగ్‌లోనూ ఇరగదీస్తూ టీమ్ఇండియాను నిలువరించింది. లక్ష్యఛేదనలో షెఫాలీ వర్మ మినహా అందరూ విఫలం కావడంతో ఓటమి ఎదుర్కొవాల్సి వచ్చింది.

ముంబై: సొంతగడ్డపై పొట్టిఫార్మాట్‌లో బోణీ కొడుదామనుకున్న భారత్‌కు నిరాశే ఎదురైంది. బుధవారం వాంఖడేలో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20 పోరులో హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్సీలోని టీమ్ఇండియా 38 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-1తో వెనుకంజలో నిలిచింది. తొలుత స్కీవర్ బ్రంట్(53 బంతుల్లో 77, 13ఫోర్లు), వ్యాట్(47 బంతుల్లో 75, 8ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 197/6 స్కోరు చేసింది. రేణుకాసింగ్(3/27), శ్రేయాంక పాటిల్(2/44) రాణించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియా 159/6 స్కోరుకు పరిమితమైంది. ఓపెనర్ షెఫాలీవర్మ(42 బంతుల్లో 52, 9ఫోర్లు) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది. సహచరుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో జట్టు ఓటమిపాలైంది. ఎకల్‌స్టోన్(3/15) మూడు వికెట్లతో టీమ్ఇండియా పతనాన్ని శాసించింది. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన స్కీవర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న జరుగనుంది.

స్కీవర్, వాట్ అదుర్స్: తొలుత టాస్ గెలిచిన భారత్..ఇంగ్లండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. రేణుకా సింగ్ వేసిన తొలి ఓవర్‌లోనే వరుస బంతుల్లో సోఫీ డంక్లె(1), ఆలైస్ క్యాప్సె(0) వెనుదిరిగారు. దీంతో టీమ్ఇండియాకు అదిరిపోయే ఆరంభం దక్కిందని అనుకున్నారు. కానీ వ్యాట్, స్కీవర్ ఇన్నింగ్స్ గతిని మార్చేశారు. వీరిద్దరు ఎదురుదాడికి దిగి పరుగులు కొల్లగొట్టారు. వ్యాట్, స్కీవర్ పోటాపోటీగా బౌండరీలు బాదడంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేసింది. ఈ జోడీనివిడగొట్టేందుకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న సైకా ఇషాక్ ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. దీంతో ఇదే అదనుగా స్కీవర్, వ్యాట్ తమదైన రీతిలో విరుచుకుపడుతూ పరుగులు కొల్లగొట్టారు. ఇషాక్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో వ్యాట్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. టీ20ల్లో భారత్‌పై ఇంగ్లండ్‌కు ఇది తొలి సెంచరీ భాగస్వామ్యం కావడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 197/6(స్కీవర్ 77, వ్యాట్ 75, రేణుకా సింగ్ 3/27, శ్రేయాంక పాటిల్ 2/44), **భారత్:** 20 ఓవర్లలో159/6(షెఫాలీవర్మ 52, హర్మన్‌ప్రీత్ 26, ఎకల్‌స్టోన్ 3/15, గ్లెన్ 1/25)

టీమ్ఇండియా సఫారీ టూర్

బెంగళూరు : ఆస్ట్రేలియాపై టి20 సిరీస్‌ను 4-1తో గెలుచుకున్న అనంతరం టీమ్ఇండియా మరో కఠిన పరీక్షకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో మూడు ఫార్మాట్లలో తలపడేందుకు బుధవారం బయలుదేరి వెళ్లింది. ఈ పర్యటనలో మూడు టి20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులలో ఇరు జట్లు తలపడనున్నాయి. ఆదివారం డర్బన్‌లోని కింగ్స్‌మీడ్‌లో తొలి టి20తో పర్యటన ప్రారంభం కానున్నది. రెండో టి20 12న గెబరాలో, మూడో టి2014న జొహాన్నెస్‌బర్గ్‌లో జరుగనున్నాయి. అనంతరం జొహాన్నెస్‌బర్గ్‌లోనే 17న వన్డే సిరీస్ ఆరంభమౌతుంది. 19న గెబెరాలో రెండో వన్డే, 21న పార్ల్‌లో మూడో వన్డే జరుగుతాయి. ఇక చివరగా బాక్సింగ్ డే (డిసెంబర్ 26)న సెంచురియన్‌లో టెస్టు సిరీస్‌కు శ్రీకారం దిద్దనున్నారు. జనవరి 3నుంచి కేప్‌టౌన్‌లో రెండో టెస్టుతో పర్యటన ముగుస్తుంది. వచ్చే యేడాది టి20 ప్రపంచకప్ జరుగనున్నందున యువ ఆటగాళ్లపై బోర్డు దృష్టి సారించనున్నది. పర్యటన కూడా టి20 సిరీస్‌తో ప్రారంభం కానున్నది. యువ ఆటగాళ్లతో కూడిన టి20 జట్టుకు సూర్యకుమార్ సారథ్యం వహించనున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బోర్డుకు తెలపడంతో జడేజా వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

మళ్లీ ఓడిన టైటాన్స్

అహ్మదాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10లో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకున్నది. బుధవారం పట్నా పైరేట్స్‌తో జరిగిన పోరులో టైటాన్స్ 28-50 స్కోరుతో పరాజయంపాలైంది. పైరేట్స్ జట్టులో సచిన్ అత్యధికంగా 14 పాయింట్లు సాధించగా, టైటాన్స్‌కు పవన్ షెరావత్ 11 పాయింట్లు సాధించాడు. ఆరంభంలో టైటాన్స్ పోటీ ఇచ్చినా మ్యాచ్ సాగేకొద్ది పైరేట్స్ ఆధిక్యం కనబరిచింది. ఏక పక్షంగా సాగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57-27తో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుగా ఓడించింది. యోధాస్ జట్టులో సురేందర్ గిల్ 13, ప్రదీప్ నర్వాల్ 12 పాయింట్లతో జట్టు విజయానికి దోహదం చేశారు. స్టీలర్స్ జట్టులో మోహిత్ నందల్(5), వినయ్(5) సమంగా అత్యధిక పాయింట్లు సాధించారు.

కివీస్ 55/5

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

మిర్పూర్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఆఖరిదైన రెండో టెస్టులో బంగ్లాదేశ్ తొలి రోజు నుంచే పట్టు బిగిస్తున్నది. ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న బంగ్లా...కివీస్‌ను తమ స్పిన్ ఉచ్చులో బిగిస్తున్నది. మెహదీ హసన్ మిరాజ్(3/17), తైజుల్ ఇస్లాం(2/29) ధాటికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. వీరిద్దరి ధాటికి విలియమ్సన్(13), మిచెల్(12 నాటౌట్) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. బంగ్లా స్పిన్నర్లను ఎదుర్కొవడంలో కివీస్ బ్యాటర్లు తీవ్రంగా తడబడ్డారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 172 పరుగులకు ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్(35) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. సాంట్నర్, ఫిలిప్స్ మూడేసి వికెట్లు తీశారు.

అయ్యో ముష్ఫికర్!

బంగ్లా సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ అరుదైన రీతిలో ఔటయ్యాడు. కైల్ జెమీసన్ బౌలింగ్‌లో బంతిని చేతితో అడ్డుకోవడం ద్వారా రహీమ్ పెవిలియన్‌కు చేరాడు. ఫీల్డింగ్‌కు అంతరాయం కల్గించాడన్న ఉద్దేశంతో థర్డ్ అంపైర్..రహీమ్‌ను ఔట్‌గా ప్రకటించాడు. ఇలా ఔటైన తొలి బంగ్లా క్రికెటర్‌గా ముష్ఫికర్ నిలిచాడు.

నిత్య పసిడి జోరు

అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ పూల్ వేదికగా జరుగుతున్న ఎనిమిదవ జూనియర్, సబ్‌జూనియర్ అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో యువ స్విమ్మర్ శ్రీనిత్య సాగి పసిడి పతక జోరు కనబరిచింది. ప్రత్యర్థులకు దీటైన సవాలు విసురుతూ ఐదు స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన బాలికల 400మీ, 800మీ ఫ్రీ స్టయిల్‌తో పాటు 100మీ, 200మీ బ్యాక్ స్ట్రోక్, 400మీ వ్యక్తిగత మెడ్లే ఈవెంట్లలో నిత్య అగ్రస్థానంలో నిలిచి ఆకట్టుకుంది. మరోవైపు హేమ వర్షిణి మూడు వేర్వేరు విభాగాల్లో స్వర్ణాలు దక్కించుకోగా, జిగ్న చౌదరీ, అభయ్ ఆకట్టుకున్నారు.

దర్శన్ ముందంజ

జాతీయ చెస్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరుగుతున్న 36వ జాతీయ అండర్-13 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో దర్శన్ ముందంజ వేశాడు. బుధవారం జరిగిన గేమ్‌లో తమిళనాడుకు చెందిన దర్శన్..రాఘవ్‌పై అద్భుత విజయం సాధించాడు. టోర్నీలో దర్శన్ ప్రస్తుతం నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మిగతా గేముల్లో వందన్, మానస్, వీరేశ్, మృణ్మయ్, సిద్దాంత్ విజయాలు సాధించారు.

టాప్-15 ప్రపంచ కుబేరుల్లో అదానీ

బ్లూంబర్గ్ ఇండెక్స్‌లో 82 బిలియన్ డాలర్లతో 15వ స్థానం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ఈ ఏడాది ఆరంభంలో హిండెన్‌బర్గ్ దెబ్బకు కుదేలైన అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ.. తిరిగిప్పుడు పుంజుకుంటున్నారు. ఈ క్రమంలోనే బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్ టాప్-15 బిలియనీర్ల జాబితాలో మళ్లీ అదానీ చోటు దక్కించుకున్నారు. తాజాగా విడుదలైన లిస్టులో 82.50 బిలియన్ డాలర్ల సంపదతో 15వ స్థానంలో నిలిచారు. 91.4 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత ముకేశ్ అంబానీ 13వ స్థానంలో ఉన్నారు. అయితే ఇటు భారత్‌లో.. అటు ఆసియాలో ముకేశ్, అదానీలే ప్రస్తుతం అత్యంత ధనవంతులుగా ఉండటం విశేషం. తొలి రెండు స్థానాల్లో ఉన్న ఇరువురికి మధ్య 8.9 బిలియన్ డాలర్ల సంపదే వ్యత్యాసంగా ఉండటం గమనార్హం.

అదానీ స్టాక్స్ పరుగులు

స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ స్టాక్స్ పరుగులు పెడుతున్నాయి. మదుపరులు ఎగబడి మరీ కొనేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గౌతమ్ అదానీ సంపద వేగంగా పెరుగుతూపోతున్నది. మంగళవారం ఒక్కరోజే అదానీ సంపద 12.3 బిలియన్ డాలర్లు ఎగబాకడం గమనార్హం. ఇక నిరుడు సెప్టెంబర్‌లో అదానీ సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముకేశ్ అంబానీని సైతం వెనక్కినెట్టి భారతీయ అత్యంత ధనవంతుడిగా స్థిరపడ్డారు. అయితే అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడిందంటూ ఈ ఏడాది జనవరిలో అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ ఓ సంచలన నివేదిక తీసుకొచ్చింది. దీంతో అదానీ షేర్లు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. సెబీ, సుప్రీం కోర్టు విచారణల్లో అలాంటిదేమీ లేదని దాదాపుగా తేలిపోవడంతో మదుపరులు తిరిగి అదానీ షేర్లలో పెట్టుబడులకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హిండెన్‌బర్గ్ రిసెర్చ్ రిపోర్టు విడుదలైన దగ్గర్నుంచి తొలిసారి బుధవారం అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లను తాకింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలవడం కూడా మార్కెట్లలో అదానీ షేర్లను ఆకర్షణీయం చేసిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

జూన్‌దాకా వడ్డీరేట్లు తగ్గవు!

రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యసమీక్షపై డ్యూయిష్ బ్యాంక్

ముంబై, డిసెంబర్ 6: వచ్చే ఏడాది జూన్ వరకు కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించకపోవచ్చని, అవి యథాతథంగానే ఉంటాయని విదేశీ బ్రోకరేజీ దిగ్గజం డ్యూయిష్ బ్యాంక్ తాజాగా అభిప్రాయపడింది. బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష మొదలైన నేపథ్యంలో ఈసారి కూడా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రెపోరేటు జోలికి వెళ్లకపోవచ్చనే డ్యూయిష్ బ్యాంక్ అంచనా వేసింది. మూడు రోజులు సాగే ఈ ద్రవ్యసమీక్షలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ దాస్ ప్రకటించనున్నారు. 'ఇప్పటికే రెపోరేటు గరిష్ఠ స్థాయిలో ఉన్నది. ఇంకా దీన్ని ఆర్బీఐ పెంచకపోవచ్చు. అలాగే ద్రవ్యోల్బణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడప్పుడే రెపోను తగ్గించకపోవచ్చు. దీంతో ఇప్పటికైతే కీలక వడ్డీరేట్లు యథాతథంగానే ఉంటాయని చెప్పవచ్చు' అని తమ తాజా రిపోర్టులో డ్యూయిష్ బ్యాంక్ పేర్కొన్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చివరిసారిగా రెపోరేటును ఆర్బీఐ పెంచింది. మళ్లీ అప్పట్నుంచి జరిగిన ద్రవ్య సమీక్షల్లో దాని జోలికి సెంట్రల్ బ్యాంక్ వెళ్లనే లేదు. దీంతో ప్రస్తుతం రెపోరేటు 6.5 శాతం వద్ద ఉన్నది. ఈసారి కూడా అక్కడే ఉంటే.. వరుసగా ఐదో ద్రవ్యసమీక్ష లోనూ వడ్డీరేట్లు యథాతథంగానే ఉన్నాయని చెప్పుకోవచ్చు.

7 ట్రిలియన్ డాలర్లకు..

2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని ఈ సందర్భంగా డ్యూయిష్ బ్యాంక్ అంచనా వేసింది. తలసరి ఆదాయం కూడా 4,500 డాలర్లను తాకవచ్చని అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్, జర్మనీలను అధిగమించి భారత్ నిలబడగలదన్న విశ్వాసాన్ని కనబర్చింది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) దేశ జీడీపీ 6.3 శాతంగా ఉండొచ్చని, ఆపై ఆర్థిక సంవత్సరం (2025-26) 6.2 శాతానికి పడిపోవచ్చని అంచనా వేసింది. కఠిన ద్రవ్య విధానమే ఇందుకు కారణమన్నది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) వృద్ధిరేటు 6.8 శాతంగా ఉండే వీలుందని చెప్పింది.

2024 ద్వితీయార్ధంలో 75 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చు

వచ్చే ఏడాది జూన్ నుంచి వడ్డీరేట్ల కోతకు ఆర్బీఐ దిగే వీలుందని అంచనా వేస్తున్న డ్యూయిష్ బ్యాంక్.. 2024 మొత్తంగా రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు (ముప్పావు శాతం) తగ్గడానికి అవకాశాలున్నాయని చెప్తున్నది. అలాగే 2025లో మరో పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) తగ్గడానికి ఆస్కారమున్నట్టు పేర్కొంటున్నది. నిజానికి వచ్చే ఏడాదే ఒక శాతం మేర తగ్గవచ్చని ఇంతకు ముందు అంచనాలో డ్యూయిష్ బ్యాంక్ ప్రకటించింది. అయితే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు 2024 జూన్ నుంచి తగ్గడం మొదలయ్యే వీలుండటంతో ఈసారి తమ అంచనాను సవరించింది. మొత్తానికి వచ్చే ఏడాది మార్చికల్లా రెపోరేటు 5.50 శాతానికి దిగొస్తుందన్న ఆశాభావాన్ని డ్యూయిష్ బ్యాంక్ వ్యక్తం చేస్తున్నది. అయినప్పటికీ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు అనుకున్న రీతిలో లేకపోతే.. ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపూ ఆలస్యం కావచ్చన్న సంకేతాలనిచ్చింది.

ఈసారి వృద్ధిరేటు 6.8%

వచ్చే ఆర్థిక సంవత్సరం 7 శాతంగా ఉండొచ్చు: సీఐఐ

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: దేశ ఆర్థిక వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) 6.8 శాతంగా నమోదు కావచ్చని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ తాజాగా అంచనా వేసింది. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) 7 శాతానికి పెరిగే వీలుందన్నది. అలాగే మౌలికాభివృద్ధిపై, వ్యాపార నిర్వహణ సులభతరంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి కొనసాగగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ చైర్మన్, సీఐఐ అధ్యక్షుడు ఆర్ దినేశ్ పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈసారి దేశ జీడీపీ 6.8 శాతంగా ఉండొచ్చన్నారు. ఇంతకుముందు 6.5-6.7 శాతంగానే అంచనా వేశామన్న ఆయన.. పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తుండటంతో తమ అంచనాను పెంచినట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబర్)గాను దేశ వృద్ధిరేటు 7.7 శాతంగా నమోదైన విషయం తెలిసిందే.

మారుతి ఈవీ వచ్చేస్తోంది..

అహ్మదాబాద్, డిసెంబర్ 6: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ.. వచ్చే ఏడాది తన తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేయడానికి సిద్ధమవుతున్నది. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించే ఈ కారును గుజరాత్ ప్లాంట్లో తయారు చేస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భర్తి ఈ సందర్భంగా తెలిపారు. 60 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ ఎస్‌యూవీ మాడల్‌ను అభివృద్ధి చేయడానికి ఇటీవల ఈ ప్లాంట్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. సుజుకీ మోటర్ కార్పొరేషన్‌తో కలిసి రూ.3,100 కోట్ల పెట్టుబడితో ఈవీలను తయారు చేయడానికి ప్రత్యేక యూనిట్‌ను నెలకొల్పిన విషయం తెలిసిందే.

16 నుంచి టీ వర్క్స్‌లో

మేకర్స్ ఫెయిర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): కొత్త ఆవిష్కరణల తయారే లక్ష్యంగా టీ వర్క్స్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 16 నుంచి 17 వరకు రెండు రోజుల పాటు టీ వర్క్స్‌లో నిర్వహించే మేకర్స్ ఫెయిర్ కార్యక్రమానికి రాష్ట్రం నుంచే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఔత్సాహికులు ఎవరైనా పాల్గొనవచ్చునని టీ వర్క్స్ ప్రతినిధి వీర చిప్పా తెలిపారు. విద్యార్థులు తమ ఆవిష్కరణల వేదికగా మేకర్స్ ఫెయిర్ హైదరాబాద్ కార్యక్రమం నిలువనున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు (https://makerfaire.tworks.in)లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఇండియాలోనే అతి పెద్ద మేకర్స్ ఫెయిర్ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ఆవిష్కర్తలు పాల్గొంటున్నారని తెలిపారు.

రికార్డుల పరంపర

- 70 వేలకు చేరువలో సెన్సెక్స్
- 21,000 సమీపంలో నిఫ్టీ

ముంబై, డిసెంబర్ 6: వరుసగా మూడో రోజూ కొనుగోళ్లు కొనసాగడంతో బుధవారం ప్రధాన స్టాక్ సూచీలు సరికొత్త రికార్డులను సృష్టించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 70,000 పాయింట్ల స్థాయిని, నిఫ్టీ 20,100 పాయింట్ల స్థాయిని టార్గెట్ చేస్తూ ముందుకు కదిలాయి. మరో 358 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ ఆల్‌టైమ్ రికార్డుస్థాయి 69,654 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఇది 69,745 పాయింట్ల స్థాయిని తాకింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 20,962 పాయింట్ల వరకూ పెరిగిన నిఫ్టీ చివరకు 83 పాయింట్లు లాభపడి నూతన గరిష్ఠస్థాయి 20,938 పాయింట్ల వద్ద నిలిచింది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయన్న ఆశాభావంతో ఇన్వెస్టర్లు తాజా కొనుగోళ్లు జరుపుతున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. కొద్ది నెలలపాటు అదేపనిగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) యూఎస్ బాండ్ ఈల్డ్స్ తగ్గడంతో తిరిగి పెద్ద ఎత్తున పెట్టుబడులు చేస్తున్నారని వివరించారు. అయితే మార్కెట్ ప్రీమియం విలువల కారణంగా షార్ట్ టెర్మ్‌లో లాభాల స్వీకరణ జరగవచ్చని నాయర్ హెచ్చరించారు. మంగళవారం భారీగా రూ.5,200 కోట్లు నిధుల్ని కుమ్మరించిన ఎఫ్‌పీఐలు బుధవారం స్వల్పంగా రూ.80 కోట్ల నికర విక్రయాలు జరిపారు. అయితే దేశీయ సంస్థలు రూ. 1,372 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారం వెల్లడిస్తున్నది.

ఐటీ షేర్ల నేతృత్వంలో ర్యాలీ

తాజా మార్కెట్ ర్యాలీకి ఐటీ షేర్లు నేతృత్వం వహించాయి. సెన్సెక్స్ షేర్లలో అన్నింటికంటే అధికంగా విప్రో 3.85 శాతం పెరిగింది. టీసీఎస్, ఎల్ అండ్ టీలు 2.3 శాతం వరకూ లాభపడగా, ఐటీసీ 2.5 శాతం జంప్‌చేసింది. ఎన్టీపీసీ 3.89 శాతం చొప్పున పెరిగాయి. టాటా మోటార్స్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్‌లు 1-2 శాతం మధ్య ఎగిసాయి. మరోవైపు ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు 1.58 శాతం వరకూ క్షీణించాయి. 1.49 శాతం వరకూ తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు స్వల్పంగా పెరిగాయి. వివిధ రంగాల సూచీల్లో యుటిలిటీస్ ఇండెక్స్ 3శాతం పెరిగింది. పవర్ ఇండెక్స్ 2.41 శాతం ఎగిసింది. ఐటీ ఇండెక్స్ 1.48 శాతం, టెక్ ఇండెక్స్ 1.18 శాతం మేర పెరిగాయి. బ్యాంకెక్స్, హెల్త్‌కేర్, టెలికమ్యూనికేషన్ సూచీలు స్వల్పంగా నష్టపోయాయి.

మద్దతుస్థాయి 20,850

నిఫ్టీకి 20,850 పాయింట్ల వద్ద మద్దతు ఉన్నదని, ఈ స్థాయిని కోల్పోతే స్వల్పకాలిక కరెక్షన్ జరగవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే తెలిపారు. 21,000 స్థాయిని దాటితే బుల్లిష్ ట్రెండ్ కొనసాగుతుందని అంచనా వేశారు.

వాణిజ్య

మహీంద్రా వాహనాలు ప్రియం

ముంబై, డిసెంబర్ 6: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కూడా వాహన ధరలను పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. వచ్చే నెల నుంచి అన్ని రకాల ఎస్‌యూవీలు, కమర్షియల్ వాహన ధరలను పెంచుతున్నట్టు వెల్లడించింది. ద్రవ